

మునగపాకలోని బీసీ కాలనీకి చెందిన బండి యశోద గర్భిణి. ప్రతి నెలా స్థానికంగా అందుబాటులో ఉండే అంగన్‌వాడీ కేంద్రం ద్వారా సేవలు పొందుతున్నారు. నెలకు సరిపడా సరకులను కేంద్రాల ద్వారా తీసుకొని పోషక విలువలతో కూడిన ఆహారాన్ని పొందుతున్నారు. తల్లిదండ్రులకు భారం లేకుండా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను పొందుతూ సంతృప్తికరంగా ఉన్నారు. దీనికి తోడు వైఎస్సార్ పోషణ కిట్‌ల ద్వారా ఆరోగ్యవంతంగా ఉండగలుగుతున్నామని చెబుతున్నారు. గతంలో అంగన్‌వాడీ సేవలు అంతంతమాత్రంగానే ఉండేవని, నేడు పోషక విలువలతో కూడిన సరకులను అందజేస్తున్నారని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మండలంలోని పాటిపల్లికి చెందిన లక్ష్మి బాలింత. స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు. గతంలో కేంద్రాల వద్ద పోషకాహారం అందించేవారు. తినేందుకు అవస్థలు పడేవారు. నేడు ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని బాలింతలు, గర్భిణులకు నెలకు సరిపడా సరకులు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాల ద్వారా నెలకొకసారి వైద్య పరీక్షలు జరుగుతున్నాయి. కాల్షియం లోపం లేకుండా ఉండేందుకు కేంద్రాల ద్వారా మందులు అందజేస్తున్నారు. మెరుగైన పోషకాహారం అందుతుండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సంపూర్ణ పోషణ కేంద్రాలు



- పోషకాలయాలుగా అంగన్‌వాడీలు
- చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు మెరుగైన సేవలు
- నెలనెలా సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ
- నాడు–నేడు ద్వారా సొంత భవనాల నిర్మాణం



మునగపాకలో పోషకాహారం తీసుకుంటున్న దృశ్యం



అరబుపాలెంలో శ్లాబ్ నిర్మాణం పూర్తయిన అంగన్‌వాడీ కేంద్రం

మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు	పక్కా భవనాలున్నవి	నాడు-నేడు ద్వారా నిర్మాణంలో ఉన్నవి	రెంట్ ఫ్రీ, అద్దె భవనాల్లో ఉన్నవి
57	14	10	33

మునగపాక : మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు సృజనాత్మకతతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సేవలు మంచి ఫలితాలు ఇస్తున్నారు. చిన్న వయస్సు పిల్లల్లో పోషక విలువలతో కూడిన ఆహారం అందించేందుకు ఏర్పాటైన అంగన్‌వాడీ కేంద్రాలు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయి. ఇక్కడ బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు మంచి పోషకాహారం అందుతుంది. పిల్లలకు ఆట పాటల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు చేరువయ్యేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో కేంద్రాల పట్ల ఆకర్షితులవుతున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తుంది.

57 కేంద్రాల ద్వారా సేవలు..

మండల వ్యాప్తంగా రెండు సెక్టార్లలకు సంబంధించి 1921 మంది పిల్లలు అంగన్‌వాడీలో సేవలు పొందుతున్నారు. అలాగే 260 మంది బాలింతలు, 357 మంది గర్భిణీలు, 780 మంది కిశోర బాలికలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం పొందుతున్నారు. 57 కేంద్రాలకు గాను 14 కేంద్రాలు పక్కా భవనాల్లో కొనసాగుతున్నాయి. నాడు–నేడు ద్వారా 10 కేంద్రాలు పలు నిర్మాణ స్థాయిలో ఉన్నాయి. మిగిలిన 33 కేంద్రాలకు గాను కొన్ని రెంట్ ఫ్రీ మరికొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

అందిస్తున్న పోషణ ఇలా...

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు సంబంధించి నెలకు 3 కిలోల బియ్యం, కిలో కంది పప్పు, అరకిలో నూనె, వైఎస్సార్ పోషణ కిట్ కింద అటుకులు, బెల్లం, రాగి పిండి, చెక్కీలు అందజేస్తున్నారు. కిశోర బాలికలకు నెలకు 25 కోడిగుడ్లు, 5 లీటర్ల నూనె అందజేస్తారు. అలాగే 7 నుంచి 3 సంవత్సరాల లోపు పిల్లలకు బాలామృతం, 25 గుడ్లు, 2.5 లీటర్ల మేర పాలు అందజేస్తారు. అలాగే 3 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలకు కేంద్రాల ద్వారా పోషకాహారం అందజేస్తున్నారు. ప్రతి రోజు గుడ్డు, 100 మిల్లీలీటర్ల పాలుతో పాటు పోషకాహారం అందజేస్తారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు.

రెండు గ్రామాల్లో అన్న సమారాధనలు

రాంబిల్లి: మండలంలో దిమిలి, కట్టుబోలు గ్రామాల్లో ఆదివారం అన్న సమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. దిమిలి గ్రామంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల సందర్భంగా, కట్టుబోలులో కైలాశేశ్వరస్వామి ఆలయం వద్ద అన్న సమారాధనలను నిర్వహించారు.

క్లుప్తంగా

మళ్లీ జగనన్నే సీఎం కావాలి



తిమ్మరాజుపేటలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీసెల్ అధ్యక్షుడు జగన్

మునగపాక : రాష్ట్ర ప్రజలకు మేలు జరగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఉందని, ఇందుకు ప్రతి ఒక్కరూ ఆశీర్వాదం అందించాలని వైఎస్సార్ సీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల జగన్ అన్నారు. వై ఏపీ నీడ్స్ కార్యక్రమంలో భాగంగా ఆయన తిమ్మరాజుపేటలో వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ముందు ప్రజ లకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలన్నారు.

రామాలయానికి సీసీ కెమెరాల వితరణ

ఎస్.రాయవరం : గ్రామాభివృద్ధికి తన వంతు సాయం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని గ్రామానికి చెందిన మత్తి కార్తీక్ చెప్పారు. ఆదివారం పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలో రామాలయానికి అవసరమైన సీసీ కెమెరాలు ఆలయ కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగంబోయిన శ్రీనివాసరావుకు అందజేశారు. స్థానిక నాయకుడు బాబూరావు, రామాలయ వైస్ ప్రెసిడెంట్ నక్కా శ్రీను పాల్గొన్నారు.

స్థానికులకు ఉపాధి కల్పించాలి

రాంబిల్లి : స్థానికులకు 75 శాతం ఉగ్యోగాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు సోమినాయుడు కోరారు. గజిరెడ్డిపాలెంలో సోమవారం డీవైఎఫ్ఐ శ్రేణుల సమావేశం జరిగింది. ప్రభుత్వం స్థానికులకు 75 శాతం ఉద్యోగాలను పరిశ్రమల్లో ఇవ్వాలని చెప్పినా పరిశ్రమల యాజమాన్యాలు అమలు చేయడం లేదన్నారు. దేముడునాయుడు, నారాయణరావు పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాలపై సంబరాలు

అచ్యుతాపురం(అనకాపల్లి): తెలంగాణ ఎన్నికల్లో గెలుపుపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆదివారం సాయంత్రం సంబరాలు చేసుకున్నాయి. యలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కూండ్రపు అప్పారావు ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయం పట్ల అచ్యుతాపురం మండల బీజేపీ కార్యాలయంలో బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకొన్నాయి. యలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాసుబాబు,రాజానరాజు,బండారు కన్నంనాయుడు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన బండిమాంబ సంబరం

- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్త జనం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- బాణసంచా వెలుగులు



అమ్మవారి సన్నిధిలో మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, సుకుమారవర్మ, ఎంపీపీ తదితరులు



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తజనం

యలమంచిలి : ఏటికొప్పాక గ్రామ దేవత బండిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా గ్రామంలో ఆదివారం రాత్రి రహదారులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. పలు వీధుల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఆలయం వద్ద భక్తులకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. యలమంచిలి సీఐ షేక్ గపూర్, రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు, పట్టణ ఎస్ఐ కె.పాపినాయుడు, ట్రాఫిక్ ఎస్ఐ డి.ఈశ్వరరావు,100 మంది పోలీసులతో పటిష్ట భద్రత కల్పించారు. అమ్మవారిని డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, ఎంపీపీ గోవింద్, యలమంచిలి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు యర్రయ్యదొర, ఏటికొప్పాక వైఎస్సార్‌సీపీ నాయకుడు సేనాపతి రాము, యలమంచిలి రూరల్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు త్రినాథ్, మర్రి రాజు, గంధం శివ, గొర్లె వెంకట్, మండల సచివాలయ కన్వీనర్ వాసు తదితరులు దర్శించుకున్నారు. బండిమాంబ ఆలయం వద్ద అమ్మవారి వేషధారణలతో ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా అలరించాయి. డ్యాన్స్ బేబీ డ్యాన్స్, నేలవేషాలు, మహిళల కోలాటం, చెక్కభజనలు, సాము గరిడీలు, బళ్లవేషాలు, సినీ డూప్స్, సంగీత విభావరి అలరించాయి. వివిధ సెట్టింగ్‌లతో భారీగా బాణాసంచా వెలిగించడంతో సంబరం అంబరాన్నంటింది. మందుగుండు సామాగ్రిపేల్చడం చూడడానికి ప్రజలు ఆసక్తిగా చూశారు.పలు వీధుల్లో ఏర్పాటు చేసిన డ్యాన్స్–బేబి డ్యాన్స్‌లు,సినీ డూప్స్,సంగీత విభావరిలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి.

గ్రామాల్లో వనభోజనాల సందడి



మునగపాకలో వనభోజనం చేస్తున్న వెలగా కుటుంబీకులు



వనభోజనాల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మునగపాక : కార్తీకమాసం ఆదివారం సందర్భంగా ఆడారి సోమన్న స్థలంలో మునగపాకకు చెందిన ఆడారి కుటుంబ సభ్యులంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి చేశారు. 275 కుటుంబాలకు సంబంధించి 1200 మంది వరకు పిల్లలు, యువకులు, పెద్దలు ఇలా ఒక చోట చేరి ఉత్సాహంగా గడిపారు. పెద్దవారిని ఘనంగా సత్కరించారు. పిల్లలకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు ఆడారి మురళి హాజరయ్యారు. మునగపాకలోని వెలగా కుటుంబ సభ్యులు కూడా ఆదివారం చెరువుకాలువ సమీపంలో వనభోజన కార్యక్రమం నిర్వహించారు.

ఎస్.రాయవరం: వేమగిరి గ్రామంలో స్వయంభూ శ్రీ రంగనాయక స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం కార్తీక మాస వనభోజనాలు కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందు, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు శారదాకుమారి శ్రీ రంగనాయక స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి తీర్థం

రాంబిల్లి : వాడనర్సాపురం గ్రామంలో ఆదివారం ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ, ఎంపీపీ శిరీష శ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ రామకృష్ణ, సర్పంచ్ కె.రామారావు, మండల కోఆప్షన్ సభ్యుడు సీహెచ్. పెంటయ్యతో పాటు అధిక సంఖ్యలో భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా తప్పెటగుళ్లు, కోలాటాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

సంక్షేమ పథకాలు వినియోగించుకోండి...



బ్రాహ్మణ సంఘం వన సమారాధనలో మాట్లాడుతున్న సత్యదేవ శర్మ

నక్కపల్లి : బ్రాహ్మణ సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నక్కపల్లి తాలూకా బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు శ్రీ ప్రసాద సత్యదేవ శర్మ గొట్టుముక్కల వరప్రసాద్, డి.వి.రామారావు కోరారు. ఆదివారం పెనుగొల్లు వద్ద నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలకు చెందిన బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన, సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులంతా సంఘం వారిని సంప్రదిస్తే పథకాలను వివరించి వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన బ్రాహ్మణ సంక్షేమ భవన్ పూర్తి చేసేందుకు సహకరించాలని ప్రతినిధులు కోరడంతో పలువురు సభ్యులు తమకు తోచిన రీతిలో విరాళాలు ప్రకటించారు. నక్కపల్లిలో ఈ భవనాన్ని సుమారు రూ.15 లక్షలు వెచ్చించి నిర్మించడం జరిగిందని, మరో మూడు లక్షల రూపాయలు ఉంటే భవనాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావచ్చని తెలిపారు.

వరి పంటను కాపాడుకోండి

కోటవురట్ల: మిచాంగ్ తుపాను నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు సూచించారు. మండలంలో పర్యటించిన ఆయన యండపల్లిలో రైతులతో మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ వరకు తుపాను ప్రభావం ఉంటుందని, అంత వరకు వరి కోతలను వాయిదా వేయాలని కోరారు. ఇప్పటికే కోతలు కోసినట్టయితే వెంటనే పనలు ఎత్తి కుప్పలు వేయాలన్నారు. ఎక్కడైనా వరి పనలు తడిస్తే 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలు తడిసేలా పిచికారీ చేయాలని సూచించారు.

గౌరీపరమేశ్వరుల నిమజ్జనోత్సవం

కోటవురట్ల : కె.వెంకటాపురంలో గౌరీపరమేశ్వరులను శనివారం రాత్రి గ్రామస్తులు భారీ ఊరేగింపు నిర్వహించారు. గ్రామ వీధుల్లో అమ్మవారిని సారెతో ఊరేగించి నిమజ్జనం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, ఎంపీటీసీ కాళ్ల రత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు గొల్లు చిట్టిబాబు, పైల నాని, మాజీ సర్పంచ్ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

నేడు మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణస్వీకారం

యలమంచిలి (అనకాపల్లి రూరల్) : యలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బొద్దపు ఎర్రయ్యదొర సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. స్థానిక గుర్రప్ప కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాపు సామాజిక వర్గానికి చెందిన బొద్దపు ఎర్రయ్యదొర గతంలో యలమంచిలి జెడ్పీటీసీగా, ఎంపీపీగా పదవులు చేపట్టారు. 2014 నుంచి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) ఆయనకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి సిఫారసు చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారు